# రౌడీయిజం

హరిత, సరితలు కవలపిల్లలు. ఇద్దరూ ఒక్కలాగే కన్పిస్తారు. సినిమాల్లో ఒక్కలా వుండే కవలలను చూపిస్తే నమ్మనివాళ్ళకు హరిత సరితలను చూస్తే ఆశ్చర్యంగానే వుంటుంది వాళ్ళ ఒక్కలాంటి పోలికలకు. బాగా పరిశీలిస్తే తెలుస్తుంది హరిత పళ్ళకన్నా సరిత పళ్ళు కాస్త ఎత్తుగా వున్నాయని. లేకపోతే ఇద్దరిలో ఏ తేడా లేదు. చిన్నప్పట్నుంచి తల్లి వాళ్ళకు ఒక్కలాంటి డ్రెస్సులే కుట్టించేది. స్కూళ్ళో టీచర్లు వాళ్ళను పోల్చుకోలేకపోయేవాళ్ళు. ఎదుటివాళ్ళ తికమక చూస్తే వాళ్ళకు తమాషాగా వుంటుంది.

హరిత సరితలిద్దరికీ ఆటల్లో అభిరుచి వుంది. వాళ్ళ అభిరుచిని చూసి ఇంట్లో తండ్రి స్కూల్లో స్పోర్ట్సు మాష్టరు వాళ్ళకు ప్రోత్సాహాన్నిచ్చారు. ఇద్దరూ రెండువందల మీటర్ల పరుగులో హర్డిల్స్ పరుగులో ప్రావీణ్యం సంపాదించారు. కాలేజీలో చేరాక స్పెషల్ కోచింగుతో వాళ్ళు యూనివర్సిటీ లెవల్లో నేషనల్ లెవల్లో బంగారు వెండి పతకాలు సంపాదించారు.

ఈసారి బీజింగులో జరిగే ఏషియన్ స్పోర్ట్సులో పాలు పంచుకోవాలని హరిత సరితలు బాగా ప్రాక్టీసు చేస్తున్నారు. పొద్దున్నే లేచి వెళ్ళడం రాత్రి పొద్దుపోయినాక ఇంటికి రావడం జరుగుతున్నది. వాళ్ళ ధ్యాసంతా వాళ్ళ ప్రాక్టీసు మీద ఉంది. ఈసారి బీజింగు నుంచి రెండు మూడు బంగారు గాని వెండిగాని పతకాలు సంపాదించాలని పట్టుదలగా వుంది వాళ్ళకు. వాళ్ళ కోచ్ కూడా వాళ్ళ మీద పూర్తి నమ్మకంతో వున్నాడు. వాళ్ళ ప్రాక్టీసుకు సంతృప్తిగా, సంతోషంగా వున్నాడు.

హరితకు పొత్తికడుపులో నొప్పిగా వుందని ఇద్దరు కోచింగు నుంచి డాక్టరు దగ్గరికి వెళ్ళారు డాక్టరు దగ్గర పెద్ద క్యూ వుంది. వాళ్ళు డాక్టరుకు చూపించుకొని బయటపడేసరికి రాత్రి పదయింది.

"ఏం ఫర్వాలేదు. అమీబియాసిస్ నొప్పి! అంతే! కాస్త కారం పులుపు తగ్గించండి!" అని డాక్టరు మందులు రాసిచ్చాడు.

హరిత సరితలు మందులు కొనుక్కొని ఆటోలో ఇంటికి బయలుదేరారు. తండ్రి అరవింద్ టూర్‌కు వెళ్ళాడు. అమ్మ ఒక్కతే ఇంట్లో వుంది - అని వాళ్ళకు ఆదుర్దాగానే వుంది.

"ఆటో జల్దీ జానేదో" అని ఆటో అతన్ని తొందరపెట్టారు.

కాని ఆటో ఇల్లు రెండువందల గజాల దూరం వుందనగా లైట్లు లేని చీకటి రోడ్డు మీద ఆగిపోయింది. డ్రైవరు రెండుమూడుసార్లు ఆటోను స్టార్టు చేసి చూసాడు కాని ఆటో స్టార్టు కాలేదు.

"పెట్రోల్ ఖతమ్ హోగయా మాలూమ్ హోతాహై!" అన్నాడు నిస్సహాయంగా.

హరిత, సరితలు ఆటోలో నుంచి దిగి ఆటోవానికి మీటరు చూసి డబ్బు ఇచ్చి ఇంటివైపు నడక సాగించారు. ఆటో డ్రైవరు ఆటోను తోసుకుంటు వెనుకకు మళ్ళీ వెళ్ళి పోయాడు.

హరిత సరితలు చకచకా నడుస్తున్నారు వెలగని దీపాలతో చీకటిగా వున్న రోడ్డు మీద. అది పెద్ద రోడ్డు కాదు. అటు యిటు కొన్ని పిచ్చిచెట్లు మొలచి ఇళ్ళు దూరం దూరంగా వున్నాయి. వాళ్ళు కొద్ది దూరం నడిచారో లేదో వెనుక నుంచి చీకట్లను చీల్చుకొని నలుగురు యువకులు హఠాత్తుగా వాళ్ళకు దగ్గరగా వచ్చారు. వాళ్ళను చూస్తే మంచి వాళ్ళుగా కన్పించలేదు హరిత సరితలకు. గబగబా అడుగులు వేసారు.

వాళ్ళతోపాటు యువకులు గబగబ నడిచారు. వాళ్ళలో ఇద్దరూ హరిత సరితల వెనుకగా దగ్గరకు వచ్చి వాళ్ళను గట్టిగా కౌగలించుకొని ముద్దు పెట్టుకోబోయారు.

హఠాత్పరిణామానికి హరిత సరితలు భయపడిపోయారు. వాళ్ళతో పెనుగులాడారు.

"ఒరే! వీళ్ళకు చాలా బలముందిరా! ఇటురా!" అని మిగతా ఇద్దర్నీ దగ్గరికి పిలిచారు. వాళ్ళు వచ్చి హరిత సరితలను ఇద్దరిద్దరు గట్టిగా చుట్టేసి పట్టుకున్నారు.

హరిత సరితలు ప్యాంట్లు వేసుకొని వున్నారు. ఇద్దరూ గట్టిగా పెనుగులాడారు. చేతులాడకుండా వుండడంతో వాళ్ళిద్దరూ ఒకేసారి కాళ్ళతో యువకులనుగట్టిగా తన్ని విడిపించుకొని ముందుకు పరిగెత్తారు. ఆ యువకులు సన్నగా బలంగా వున్నారు. అందులో ఆడపిల్లలతో తన్నులు తిన్నామే అని కోపంతో వాళ్ళ బలం మరీ ఎక్కువైంది. వాళ్ళు పరిగెత్తి హరిత సరితలను చుట్టేసి గట్టిగా పట్టుకున్నారు. వాళ్ళను ముద్దు పెట్టుకోబోయారు. హరిత సరితలు మళ్ళీ బలంగా పెనుగులాడారు. ఆ పెనుగులాటలో ఆ యువకుల పళ్ళు గోళ్ళు వాళ్ళ శరీరం మీద గాయాలు చేసాయి. బట్టలు చిరిగిపోయాయి.

హరిత సరితలు చేతులు కాళ్ళు ఆడక నోరు తెరిచి పళ్ళతో వాళ్ళను కొరకడం మొదలుపెట్టారు. హరిత సరితల బలానికి వేగానికి రౌడీ యువకులు తట్టుకోలేకపోయారు.

"వీళ్ళు సామాన్యంగా లొంగేటట్లుగా లేరురా!" అని చెరొకర్ని చెరొక యువకుడు పెడరెక్కలుగా చేసి పట్టుకుంటె మిగతా ఇద్దరు హరిత సరితలను చేతుల్తో చెంపల మీద చరిచారు. ఆ దెబ్బలకు వాళ్ళ నోట్లోంచి రక్తం వచ్చింది. పళ్ళన్నీ ఊసిపోయినట్లనిపించింది. ఆ దెబ్బలతో వాళ్ళు బలహీనమైపోయారు. అయినా పెనుగులాడడం మానలేదు. ఇద్దరొకేసారి "హెల్ప్! హెల్ప్!" అని అరిచారు.

ఎవరూ వాళ్ళ సహాయానికి రాలేదు. వాళ్ళ అరుపులు ఎవరికైనా విన్పించాయో లేదో తెలియదు. కాని వాళ్ళు బలమంతా కూడగట్టుకొని ఒక్కసారే గట్టిగానే అరిచారు. ఎవరికైనా వినపడ్డా ఇంకొకరి విషయంలో సహాయం చేయడమంటే ఆపద కొనితెచ్చుకోవడమే అనే ఉద్దేశంతో తలుపులు మరీ బిగించుకొని విన్నవాళ్ళు ఇంట్లోనే వుండిపోతారు కూడా.

ఇంతలో రౌడీలు వాళ్ళ నోళ్ళు గట్టిగా మూసేసి వాళ్ళ నాలుగు చేతులు బంధించి ఎక్కడ బడితే అక్కడ ముద్దు పెట్టుకోసాగారు. అవి ముద్దులు కాదు. నోళ్లు తెరిచి వాళ్ళను ఆకలిగా మింగేసినట్లుగా రక్కడం మొదలుపెట్టారు.

హరిత సరితలు బలహీనంగా వున్నా పెనుగులాడుతూనే వున్నారు. వాళ్ళ రాక్షసబలం ముందు ఆ ఆడపిల్లల బలం ఎందుకూ పనికిరాలేదు. ఇంతలో సరిత తనను పట్టుకున్న రౌడీలను కాలెత్తి గట్టిగా గజ్జల్లో తన్నింది. ఆ కాలి తన్నులకు ఇద్దరూ ఆమెను విడిచిపెట్టి కుప్పకూలిపోయారు. సరిత ముందుకు పరిగెత్తింది. హరితను పట్టుకున్న రౌడీలు ఆమెను విడిచిపెట్టి సరిత వెంట పరిగెత్తి కొద్దిదూరంలోనే ఆమెను పట్టుకున్నారు. చీకట్లో వాళ్ళ కళ్ళు తెల్లగా మెరిసాయి. ఇద్దరిలో ఒకడు ప్యాంటు వెనుక జేబులో నుంచి కత్తిని తీసి బటను నొక్కాడు. వెంటనే తెల్లగా మెరుస్తూ జానెడు కత్తి బయటికి వచ్చింది. దాంతో వాడు సరిత డొక్కలో పొడిచాడు. సరిత పెనుగులాడింది. వాడు మళ్ళీ మళ్ళీ ఆమె కడుపులో పొత్తికడుపులో పొడిచాడు. రక్తం మడుగులో పడిపోయింది సరిత.

"అరే! చచ్చిపోయిందిరా!" అన్నాడు మరొకడు. కత్తితో నిలబడి వున్నవాన్ని లాక్కొని వెనుకకు పరిగెత్తాడు. క్షణంలో ఆ నలుగురూ అంధకారంలో లీనమైపోయారు.

ఇదంతా చూసి హరిత తట్టుకోలేకపోయింది. స్పృహ కోల్పోయి కిందపడిపోయింది. ఆమె ప్యాంటు టీషర్టు చిరిగి వున్నాయి. శరీరం మీద ఎక్కడ చూసినా రక్తపు చారికలు! గాయాలు!

ఆ స్థితిలో పోలీసులు ఆమెను చూసి దవాఖానాలో చేర్పించారు.

హరితకు ఆ రాత్రి స్పృహ లేదు. మర్నాడు స్పృహ వస్తున్నది కాని వెంటనే భయం

కరమైన దృశ్యం. సరిత కింద కూలిపడడం రౌడీల దౌర్జన్యం గుర్తుకు వచ్చి వెంటనే మూర్ఛలోకి జారుకుంటున్నది.

పోలీసుల టెలిగ్రాం అందుకొని అరవింద్ వచ్చాడు. దు:ఖంతో భార్య దవాఖానా అఱలో కూతురు పక్కన కూర్చొని కన్పించింది. గాయాలతో చెదిరిన మనస్సుతో కూతురు మంచం మీద వుంది. ఒక కూతురు రౌడీల దౌర్జన్యానికి బలయింది.

ఇద్దరు కూతుళ్ళు పరుగుపందెంలో దేశానికి కీర్తి తేవలసినవాళ్ళు! తనకు తన కుటుంబానికి మొత్తం రాష్ట్రానికి దేశానికి గర్వకారణమౌతారనుకున్నాను! ఎన్నో బంగారుపతకాలు గెల్చి తెచ్చి భారతదేశం ఆటల్లో ఏమీ తక్కువ కాదని నిరూపించవలసిన వాళ్ళు! ఇట్లా మగాళ్ళ దౌర్జాన్యానికి గురి అయ్యారు! - ఈ ఆలోచనలతో అరవింద్ ఎడతెరపి లేకుండా కన్నీళ్ళు కారుస్తూ చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తూ కూతురు పక్కన కుర్చీలో కుప్పకూలిపోయాడు. డాక్టరు నర్సు పరిగెత్తుకొనివచ్చి అతన్ని మరో గదిలోకి తీసికెళ్ళి ఇంజక్షన్ ఇచ్చి పడుకోబెట్టారు.

ఆ మర్నాడు హరిత బాగా స్పృహలోకి వచ్చింది. కాని అమె శూన్యమైన చూపులను చూస్తే తలిదండ్రుల దు:ఖం కట్టలు తెంచుకొని పారింది.

"మీరే ఇట్లా అధైర్యపడితే అదెట్లా కోలుకుంటుంది చెప్పు! అరవింద్! సావిత్రీ! మీరు ఆ పిల్లకు ధైర్యం చెప్పాలి. మనుషుల్లోకి తేవాలి. తక్షణ కర్తవ్యం అది మీకు!" అని వచ్చిన బంధువులు చెప్పి వెళ్ళారు.

అరవింద్ సావిత్రి దు:ఖాన్నంతా మింగి ధైర్యంగా కూతురు పక్కన చేరారు. ఆమెకు ధైర్యం చెప్పారు. కాని హరిత దైన్యం కూడగట్టుకున్న ముఖం చూసైనా పోలీసులు ఆగలేదు.

"మీకెవరైనా బోయ్‌ఫ్రెండ్సు వున్నారా?" అని అడిగాడు పోలీసు ఇన్‌స్పెక్టరు. హరిత వెక్కివెక్కి ఏడుస్తూ తల్లి సావిత్రి వక్షస్థలంలో ముఖం దాచుకుంది.

"ఇన్‌స్పెక్టరుగారూ! మీరు ఇంకా కొంతకాలం ఆపాలి ప్రశ్నలడగడం. అయినా అదేం ప్రశ్న! మీరు అడిగే తీరు ఏం బాగాలేదు!" అన్నాడు అరవింద్.

"ఎట్లా అడగాలో మాకు తెలుసు! మీరు కల్ప్రిట్సును పట్టుకోవడంలో సహకరించక పోతే మేమేం చేయలేం! ఈ కేసు ముందుకెళ్ళాలంటే మేమడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పాలి మరి! అయినా నేను ఆ అమ్మాయిని ప్రశ్నలడిగినప్పుడు మీరు ఇక్కడ వుండ వద్దు!" అన్నాడు ఇన్‌స్పెక్టరు సీరియస్‌గా ముఖంపెట్టి.

అరవింద్ నిస్సహాయంగా తలొంచుకున్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళూరాయి.

"సరే! నేను రేపు మళ్ళీ వస్తాను! ఆ అమ్మాయికి మాతో సహకరించమని చెప్పండి!" అని వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టరు. మర్నాడు వచ్చాడు.

"మీకెవరైనా బోయ్ ఫ్రెండ్స్ వున్నారా?" మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు.

హరితకు ఏడ్పు వచ్చింది.

లేరన్నట్లుగా అడ్డంగా తలూపింది. "మరి మిమ్మల్ని అటాక్ చేసినవాళ్ళెవరు? మీకు తెలిసిన వాళ్ళేనా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

లేదన్నట్లుగా మళ్ళీ అడ్డంగా తలూపింది హరిత.

"వాళ్ళెంతమంది?"

నలుగురన్నట్లుగా హరిత నాలుగువేళ్ళు చూపింది.

"నలుగురా?"

అవునన్నట్లుగా తల కిందికి మీదికి ఊపింది హరిత.

"మీరసలు రాత్రివేళ చీకట్లో ఎందుకు వెళ్తున్నారు?" అని అడిగి ఇన్‌స్పెక్టరు అరవింద్ వైపు ముఖం తిప్పి "అదేనండి ఈ ఆడపిల్లలతో కష్టం! మగాళ్ళను ప్రొవకేటు చేసేటట్లుగా డ్రెస్సు చేసుకుంటారు. రాత్రిపూట చీకటి అనకుండా తిరుగుతారు!" అన్నాడు.

హరిత కళ్ళవెంట జలజలమని కన్నీళ్ళు ధారలుగా కురిసాయి. వెక్కి వెక్కి ఏడ్చింది.

హరిత సరితలు ఆ రాత్రి ఎందుకు ఎక్కడికి వెళ్ళారో అరవింద్ ఇన్‌స్పెక్టరుకు చెప్పాడు.

"సరే! సరే! వీళ్ళ బోయ్‌ఫ్రెండ్సు మీది ఈర్ష్యతో అంటే ఐమీన్ - వీళ్ళ బోయ్‌ఫ్రెండ్సు ఇంకా వేరే బోయస్ గ్రూపు మధ్య ఎనిమిటీ - ఐ మీన్ - శత్రుత్వంతో వీళ్ళను అటాక్ చేసి వుంటారు!" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"మా అమ్మాయిలకు బోయ్‌ఫ్రెండ్సు ఎవరూ లేరండి. వాళ్ళు సీరియస్‌గా పరుగు పందానికి ఏషియన్ గేమ్సుల్లో పాల్గొనడానికి బీజింగు వెళ్ళాలని ప్రాక్టీసు చేస్తున్నారు. వాళ్ళ ప్రాక్టీసు తప్ప వాళ్ళకు మరో లోకమే లేదు ఇన్‌స్పెక్టరు!" చెప్పాడు అరవింద్.

"హో! అయితే గేమ్సుల్లోని ఈర్ష్యతో వీళ్ళను పైకి రానీయకుండ ఎవరైనా అటాక్ చేసారేమో! అటువంటి పాసిబులిటీ వుందంటారా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"ఈ రాష్ట్రం నుంచి వీళ్ళిద్దరే సెలెక్టు అయ్యారు. కొన్ని రోజుల్లో ఫైనల్ కోచింగుకు పటియాలా, పంజాబ్ వెళ్ళాలని తయారవుతున్నారు. ఇంతలో ఇది జరిగింది" దు:ఖంతో చెప్పాడు అరవింద్.

"మా పిల్లలకు శత్రువులెవరూ లేరండి" అంది సావిత్రి భర్త భుజం మీద చేయి వేసి అతన్ని ఊరడిస్తూ.

ఇన్‌స్పెక్టరు తల పంకించాడు. హరితవైపు చూసి "మిస్ హరితా! నువ్వు ఆ నలుగుర్ని గుర్తుపడ్తావా! ఐమీన్ ఫోటోలు చూపిస్తే"

లేదన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది హరిత. ఆమె ముఖం పాలిపోయింది ఆ రాత్రి దృశ్యం మనస్సులో మెదిలి.

"అట్లయితే ఈ కేసు ముందుకెళ్ళడం కష్టం!" అన్నాడు నిస్సహాయంగా కోపం కాఠిన్యం ధ్వనించే స్వరంతో ఇన్‌స్పెక్టరు.

అతడు ఆ రోజుకు వెళ్ళిపోయాడు. మర్నాడు కొన్ని ఫొటోలు తీసుకొని వచ్చాడు.

"చూడు మిస్ హరితా! చీకట్లో వాళ్ళ ముఖాలు నువ్వు సరిగ్గా చూసి వుండవు. అయినా ఈ ఫొటోలు చూసి వీళ్ళల్లో ఎవర్నైనా గుర్తించగలవా చెప్పు. ఐ మీన్ - బాగా ఆలోచించి చూసి చెప్పు! సరేనా!" అని హరిత చేతికి ఫొటోల కట్టను ఇచ్చాడు.

హరిత భయంగా ఆ ఫొటోలను తీసుకోడానికి వెనుకాడింది. అరవింద్ ఆ ఫొటోల కట్టను తీసుకొని ఒక్కొక్క ఫొటో తీసి కూతురుకు చూపించాడు. ఆ ఫొటోలోంచి నాలుగు ఫొటోలు గుర్తించింది హరిత.

"ఆ రాత్రి వీళ్ళో కాదో తెలియదు. కానీ! - వీళ్ళు నలుగురు చాలాసార్లు కాలేజీ నుంచి ఇంటికి మమ్మల్ని ఫాలో అయ్యేవాళ్ళు" ఆగుతూ ఆగుతూ మెల్లగా చెప్పింది హరిత.

"ఊఁ..." తల పంకించాడు ఇన్‌స్పెక్టరు.

"ఎవరు వాళ్ళు ఇన్‌స్పెక్టరు?" అడిగాడు అరవింద్.

"వాళ్ళు విద్యార్థులు కాదు. రౌడీలు! చిన్నచిన్న దొంగతనాలు దోపిడీలు వాళ్ళ వృత్తి. చదువుకొని డిగ్రీలున్న వాళ్ళే కాని ఏ పనీపాటకు ఒంగరు. ఏ పనిలో ఇముడక ఏ పనీపాట లేక తిరుగుతుంటారు. ఏది చేతికి దొరికితే అది దక్కించుకోవడం వాళ్ళకొక ఆట!" అన్నాడు ఇన్‌స్పెక్టరు హరిత వైపు చూసి.

"వాళ్ళు మిమ్మల్ని వెంబడిస్తూ ఏమైన అనేవాళ్ళా?" అని అడిగాడు.

"ఏవో కామెంట్సు పాస్ చేసేవాళ్ళు. కానీ మేమెప్పుడు వాళ్ళను లెక్క చేయలేదు. సీరియస్‌గా తీసుకోలేదు" అంది హరిత హీనస్వరంతో.

"ఊఁ...." మళ్ళా తల పంకించాడు ఇన్‌స్పెక్టరు.

"దొంగతనాలు చేసి సంపాదించిన డబ్బుతో తినడం! తాగడం! ఆడవాళ్ళ వెంట పడడం అవకాశం దొరికితే దౌర్జన్యం చేయడం ! పురుషాహంకారం చూపడం వాళ్ళ ప్రవృత్తిగా ఏర్పడింది" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"అటువంటివాళ్ళ దౌర్జన్యానికి ఆడపిల్లలు బలి కావల్సిందేనా? ఇన్‌స్పెక్టరు!" దు:ఖంతో అన్నాడు అరవింద్.

"ఏమమ్మా హరితా! మీరు హెల్ప్ కోసం అరవలేదా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"అరిచాం అంకుల్! కానీ ఎవరూ తలుపులు తెరుచుకొని బయటికి రాలేదు" ఆగింది హరిత జ్ఞాపకం తెచ్చుకుంటూ.

"అదీ! ఎవరూ ఎవరికీ హెల్ప్ చేయడానికి ముందుకు రారు! అన్నీ పోలీసే చూసుకోవా

లనుకుంటారు" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"మరోలా అంటారు కూడా ఇన్‌స్పెక్టరు! ఎవరైనా సహాయం చేయడానికి వెళ్తే పోలీసు వాళ్ళనే కేసులో ఇరికిస్తారు. ఎన్నో విధాల సతాయిస్తారని! ప్రజలు భయపడి ఏ క్రైమ్ జరిగినా సహాయం చేయడానికి ముందుకురారు! అవునా ఇన్‌స్పెక్టరు" అన్నాడు అరవింద్.

"వాళ్ళను కేసులో ఇరికిస్తారని భయం! ఊఁ అదొక సాకు! ప్చ్ - అంతే!" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"తర్వాత ఏమైందమ్మా!" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"తర్వాత- వాళ్ళు మా నోళ్ళు అరవకుండా మూసేసారు. మేం పెనుగులాడినా కాళ్ళతో తన్నినా వాళ్ళ రాక్షసబలం ముందు గెలవలేకపోయాం" హరిత అంతా జ్ఞాపకం వచ్చి వెక్కివెక్కి ఏడ్చింది. కాస్సేపాగి

"అట్లా గట్టిగా పెనుగులాడి పరిగెత్తుతుంటే సరితను ఒక రౌడీ జేబులోంచి కత్తి తీసి పొడిచాడు" అని పెద్దగా భోరున ఏడ్చింది హరిత.

అరవింద్, సావిత్రి కూతురు పక్కకు పరిగెత్తారు. అరవింద్ కూతురును చాతి మీదికి తీసుకొని ఆమె తల నిమిరాడు.

"ఏం చేసిందని సరితను చంపారు వాళ్ళు నాన్నా! ఎందుకు నన్నీ విధంగా చేసారు! చెప్పమ్మా! మేమేం చేసాం! ఎందుకిట్లా చేసారు వాళ్ళు - మా ఆశలన్నీ చచ్చిపోయాయి నాన్నా! ఇక బీజింగుకు పోలేం. ఇక ఆటలు ఆడలేం. మా టాలెంటు అంతా వేస్టయింది నాన్నా! అమ్మా!" అమ్మా నాన్నల కౌగిలిలో బిగ్గరగా ఏడుస్తూ ఒదిగిపోయింది హరిత.

* * *